సాక్షి

# అంధత్వ నివారణలో స్వచ్ఛంద సంస్థల భాగస్వామం : రౌతు

## గౌతమీ నేత్రాలయం సేవలకు ప్రశంసలు

రాజమండ్రి, ఆగస్ట్ 16 : అంధత్వ నివారణకు ప్రభుత్వం చేస్తున్న కృషిలో స్వచ్ఛంద సంస్థలు కూడా భాగస్వామ్యం కావాలని రాజమండ్రి ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు అన్నారు. ఈ విషయంలో నగరంలోని గౌతమీ నేత్రాలయం ముందుండడం ముదావహమని



అన్నారు. దుర్భర జీవితం అనుభవిస్తున్న ఆరుగురు అంధ బాలురకు స్థానిక కోరుకొండ రోడ్డులోని గౌతమీ నేత్రాలయంలో డాక్టర్ జి.మాధవి నేతృత్వంలో స్వాతంత్ర్య దినోత్సవం నాడు శస్త్ర చికిత్స నిర్వహించి ఈ ప్రపంచాన్ని చూడగలిగే అవకాశం కల్పించారు. నేడు వారు స్వస్థలాలకు బయలుదేరే ముందు ఎమ్మెల్యే రౌతు చేతుల మీదుగా మందుల కిట్లను, నల్ల కళ్ళజోళ్ళను అందజేశారు. ఈ సందర్భంగా రౌతు మాట్లాడుతూ సేవా దృక్పథంతో పనిచేస్తున్న గౌతమీ నేత్రాలయం కార్యకలాపాలకు తను సహాయ సహకారాలు అందిస్తానని హామీ ఇచ్చారు. ఆసుపత్రి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మధు, డాక్టర్ మాధవి దంపతులు అట్టడుగు వర్గాలకు అందిస్తున్న సేవలను రౌతు కొనియాడారు. (మిగతా 3వ పేజీలో)

## అంధత్వ నివారణలో స్వచ్ఛంద సంస్థల భాగస్వామం : రౌతు

(మొదటి పేజీ తరువాయి)

మధు మాట్లాడుతూ ప్రతి నిమిషానికి పదహారేళ్ళ లోపు పిల్లల్లో ఒకరు కంటిచూపు కోల్పోతున్నారని, సరైన సమయంలో వీటిని గుర్తిస్తే వారిలో 50 శాతం అంధత్వాన్ని నివారించవచ్చునన్నారు. జిల్లాలో అంధత్వం కలిగిన బాలలను 2700 మంది వున్నారని ఆయన తెలిపారు. తమ నేత్రాలయంలో తెల్లకార్డులు వున్న పేదలకు తక్కువ పెన్షన్ పొందుతున్న వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు, శస్త్ర చికిత్సలు చేస్తామని తెలిపారు. డాక్టర్ మాధవి మాట్లాడుతూ మేనరికాలు, దగ్గరి సంబంధాల వల్ల పుట్టబోయే సంతానికి అంధత్వం వచ్చే అవకాశం వుందన్నారు. కాగా నిన్న శస్త్ర చికిత్స చేసిన ఆరుగురిలో ముగ్గురు బంగారు అంజిబాబు, గంగాభవాని, దేవి ఒకే తల్లి కడుపున జన్మించిన బిడ్డలు. పుట్టు అంధులైన తమ ముగ్గురు సంతానానికి ఒకేసారి చూపును ప్రసాదించినందుకు వారి తల్లిదండ్రులు బంగారి దుర్గారావు, అప్పలనరసమ్మ పట్టరాని ఆనందాన్ని వ్యక్తం చేశారు. గౌతమీ నేత్రాలయానికి వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ అరవ సురేష్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు మార్గాని రామకృష్ణగౌడ్, అబ్దుల్లా షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.